క్లుప్తంగా

ప్లాస్టిక్ నిర్మూలనకు తోడ్పడండి



స్వాధీనం చేసుకున్న ప్లాసిక్ కవర్లు, గ్లాసులు. చిత్రంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్

కొవ్వూరు: మునిసిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలనకు ప్రజలు తమ వంతు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీ రమణరావు కోరారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలనలో భాగంగా శనివారం తనిఖీలు నిర్వహించామన్నారు. పలు దుకాణదారుల నుంచి రూ.3,200 అపరాధ రుసుంగా వసూలు చేసినట్టు తెలిపారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా కొవ్వూరును తయారు చేసేందుకు వ్యాపారస్తులు, ప్రజలు తమవంతు సహకరించాలని కోరారు. పట్టణంలో మైక్‌ల ద్వారా ప్రచారం చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉండ్రాజవరం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరగకుండా పారదర్శకంగా నిర్వహించేలా చూడవలసిన బాధ్యత టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు.2021 ఏప్రిల్ 1 నుంచి, 2022 మార్చి 31 వరకూ మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏడాదిగా పసలపూడిలో ఫీల్డ్ అసిస్టెంట్‌కు పనిచేస్తున్నట్టు రికార్డుల్లో పేర్కొన్నప్పటికీ నేటికీ అతడికి పోస్టింగ్ ఇవ్వలేదని ఆగ్రామ ప్రజాప్రతినిధులు ప్రజావేదిక దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సీఎస్ రామగోపాల్, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, విజిలెన్స్ వింగ్ సురేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తనిఖీ సకాలంలో పూర్తి చేయాలి

నిడదవోలు రూరల్: ఓటర్ల జాబితా తనిఖీ సకాలంలో పూర్తిచేయాలని టీడీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సూచించారు. తిమ్మరాజుపాలెంలోని తిరుచానూరు పద్మావతి ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నిడదవోలు క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు పంచదార దుర్గాప్రసాద్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అయ్యవరం ఓపెన్ కేటగిరీకి..

నల్లజర్ల: గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లజర్ల మండలంలో ఏడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వై.సుందరి తెలిపారు.అయ్యవరం-1 ఓపెన్ కేటగిరీకి కేటాయించామని ఆమె సూచించారు.

సారా కేసుల్లో ఇద్దరు బైండోవర్

కొవ్వూరు: సారా కేసుల్లో నిందితులైన చాగల్లు మండలానికి చెందిన ఇద్దరిని శనివారం చాగల్లు తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్‌ఈబీ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు.బ్రాహ్మణగూడేనికి చెందిన నిచ్చెనకోళ్ల తాతారావు, ఊనగట్లకు చెందిన చోళ్ల రామారావులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కాంతారావుకు పలువురి పరామర్శ

చాగల్లు: బ్రాహ్మణగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొలాటి కాంతారావును ఎంపీపీ మట్టా వీరాస్వామి శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంతారావు కుమారుడు అభిలాష్ మృతి చెందాడు.ఈ సందర్భంగా అభిలాష్ చిత్ర పటానికి ఎంపీపీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యులు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు అత్కూరి దొరయ్య, ఎస్ ముప్పవరం సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జగనన్న మహిళా పక్షపాతి

- మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి
- డ్వాక్రా మహిళలతో కలసి 'ఆసరా' ఆవిష్కరణ వీక్షణ



కొవ్వూరులో సీఎం సందేశాన్ని తిలకిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, డ్వాక్రా మహిళలు



తిమ్మరాజుపాలెం అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లారావు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలనూ మహిళల పేరుతో అందించడమే గాకుండా అన్ని రంగాల్లోనూ వారికి ప్రాధాన్యం ఇస్తూ మహిళా పక్షపాతిగా పేరుగాంచారని మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. స్థానిక క్రిస్టియన్ పేటలోని రెండో సచివాలయంలో శనివారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దెందులూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం ప్రత్యక్ష ప్రసారాన్ని మహిళలతో కలసి ఆమె టీవీలో వీక్షించారు. అనంతరం రత్నకుమారి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ అమలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు మూడో విడతగా పట్టణంలో 541 గ్రూపులకు రూ.4,32,30,163 మొత్తాన్ని జమ చేయనున్నారని వివరించారు. రుణమాఫీ పేరుతో గతంలో చంద్రబాబు అక్కచెల్లెమ్మలను మోసగించిన విషయాన్ని ఏ ఒక్క మహిళా మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని మహిళలకు వినిపించేలా పట్టణంలోని పది సచివాలయాల్లో ఏర్పాట్లు చేశామని సీఎంఎం ఎ.జ్యోతి అన్నారు. కార్యక్రమంలో పలువురు సీఏలు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి ఆసరా

నిడదవోలు రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. నిడదవోలు పట్టణ, మండల పరిధిలోని సచివాలయాల్లో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం అమలుపై అవగాహన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మరాజుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పల్లారావు మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తం సొమ్ములు నాలుగు విడతలుగా అందజేస్తూ మహిళల జీవనోపాధికి ప్రభుత్వం ఆసరాగా నిలిచిందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అధినేతకు స్వాగతం



వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత ఆవిష్కరణకు శనివారం ఏలూరు జిల్లా దెందులూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హోం మంత్రి తానేటి వనిత హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి వనిత పాల్గొన్నారు.

–కొవ్వూరు

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో రాష్ట్ర పరిశీలకుడి తనిఖీ

నల్లజర్ల: ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నల్లజర్లలోని ఎస్ఆర్‌కే, ఏకేఆర్జీ, శశి కళాశాలల పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ, పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు కె.ప్రసాద్ శాస్త్రి శనివారం తనిఖీ చేశారు. ఈ మూడు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో ఆయన పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్సా కేంద్రాల పనితీరు గురించి తెలుసుకున్నారు.

డివిజన్‌లో 287 మంది గైర్హాజరు

కొవ్వూరు: డివిజన్ వ్యాప్తంగా ఉన్న 15 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 287 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. మొత్తం 5,188 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4,901 మంది హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 4,317 మందికి గాను 4,149 మంది హాజరవగా 168 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరిలో 871 మందికి గాను 752 మంది హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల ద్వారా శనివారం నిర్వహించిన పరీక్షకు 30 మంది గైర్హాజరయ్యారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు

కొవ్వూరు: స్థానిక 23వ వార్డు రౌండ్ రామాలయంలో ఈనెల 30వ తేదీ ఉదయం 8.05 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం ప్రారంభం అవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీరామ నవమికి ఆలయం వద్ద ఏర్పాట్లు పూరి చేశామన్నారు. సీతారాముల కల్యాణోత్సవం అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు సాయంత్రం పూట భజన, ఏప్రిల్ 3వ తేదీ రాత్రి 8 గంటలకు కంకణ విమోచన మహోత్సవ పూజ నిర్వహిస్తామన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారదేవానికి చెందిన యండపల్లి లక్ష్మణకుమార్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దొమ్మేరులో పండ్లు కొనుక్కుని మోటార్ సైకిల్‌పై వస్తున్న లక్ష్మణ కుమార్‌ను కారు వెనుక నుంచి ఢీకొట్టింది. క్షతగాత్రుడు లక్ష్మణ కుమార్‌ను రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

ఉసులుమర్రులో 111 మందికి దంత వైద్య సేవలు



దంత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెరవలి: మండలంలోని ఉసులుమర్రు గ్రామంలో లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో శనివారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ ఆర్థిక సహాయంతో ఆ పార్టీ నాయకులు రామడుగుల సూర్యనారాయణ, దౌలూరి శ్రీనివాస్ తోడ్పాటులో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భీమవరానికి చెందిన విష్ణు దంత వైద్య కళాశాల వైద్యులు 111 మందికి దంత పరీక్షలు చేశారు. వారిలో 66 మంది దంతాలను క్లీనింగ్ చేశారు. మరో 45 మందిని తదుపరి చికిత్స కోసం సిఫార్సు చేసినట్టు డాక్టర్ ఆదిత్య తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి సారథ్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ సలాది ఉదయ భాస్కరరావు, సభ్యులు రంగా వెంకటేశ్వరరావు, అడపా బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యురాలు జన్ని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి 31 వరకూ గడువు

కొవ్వూరు: కుమారదేవంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 31 వరకూ పొడిగించారని ప్రిన్సిపాల్ పి.సుజాత శనివారం తెలిపారు. తొలుత 2023–24 విద్యాసంవత్సరానికి దరఖాస్తుల గడువు ఈనెల 24 వరకూ ఇచ్చారు. ఈ గడువును వారం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆమె వివరించారు. ఏప్రిల్ 23 ఉదయం పది నుంచి 12 గంటల వరకూ ఐదో తరగతి విద్యార్థులకు, అదే రోజు మధ్యాహ్నం రెండు నుంచి నాలుగున్నర గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

గురు శిష్యులదీ భక్తుడు, దేవుడి సంబంధమే

- మధురపూడి ఆశ్రమ పీఠాధిపతి సుందర స్వామీజీ



దూబచర్ల మహా పీఠంలో మహాయజ్ఞం వద్ద మాట్లాడుతున్న సుందరస్వామీజీ

నల్లజర్ల: భక్తునికి, భగవంతునికి ఉన్న సాన్నిహిత్యమే గురుశిష్యుల మధ్య కూడా ఉంటుందని సుందరస్వామి ప్రవచించారు. దూబచర్లలోని దత్తసాయి పంచావతార మహాపీఠంలో గురుచరిత్ర సప్త, సప్తాహ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మూడో రోజైన శనివారం మధురపూడి ఆశ్రమ పీఠాధిపతి సుందరస్వామి ముఖ్య అతిథిగా హాజరై గురుశిష్య అనుబంధంపై మాట్లాడారు. జీవితాన్ని మంచి మార్గంలో నడిపించేవాడే గురువు అని అలాంటి గురువు దైవంతో సమానమన్నారు. లోక జ్ఞానాన్ని అందించే గురువును అర్థం చేసుకొని ఓపిక, సహనం కలిగిన వాడే నిజమైన శిష్యుడన్నారు. 45 మంది దంపతులు ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వల్లభపురం నుంచి వచ్చిన మాతాజీ నిరంజనానంద, సూర్యప్రకాశరావు పర్యవేక్షించారు.

ఘంటావారిగూడెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పరస్పరం కేసుల నమోదు

నల్లజర్ల: ఓ ఇంటి విషయమై ఘంటావారిగూడెంలో ఇరు వర్గాలు ఘర్షణ పడి కొట్లాడుకున్నట్టు నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన వనచర్ల మురళీకృష్ణ తండ్రి రామచంద్రరావు తన ఇంటిని అదే గ్రామానికి చెందిన ఆలపాటి రమేష్ వద్ద డబ్బు తీసుకొని తనఖా పెట్టాడు. డబ్బు చెల్లించినా తన ఇల్లు తనకు అప్పగించలేదని ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రమేష్ తన ఆధీనంలో ఉన్న ఆ ఇంటిని ఒకరికి అద్దెకు ఇచ్చారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారిని ఖాళీ చేయాలంటూ వనచర్ల మురళీకృష్ణ ఒత్తిడి తెచ్చారు. ఖాళీ చేయడానికి వారు అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆలపాటి రమేష్, మురళీకృష్ణ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గాయాల పాలైన వనచర్ల మురళీకృష్ణ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోను ఆలపాటి మురళీకృష్ణ తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలోను చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు సీఐ లక్ష్మణరెడ్డితెలిపారు.

ఎస్సీల్లో చేర్చే తీర్మానం చరిత్రాత్మకం

కొవ్వూరులో 'కృపా' నాయకుల హర్షం

కొవ్వూరు: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేయడం చరిత్రాత్మక నిర్ణయమని కొవ్వూరు రిజెండ్ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ (కృపా) నాయకులు పేర్కొన్నారు. స్థానిక క్రిస్టియన్ పేటలోని ఇస్మానియేల్ చర్చిలో శనివారం ఆ సంఘ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్.ఫిలిప్ మాట్లాడుతూ 1950లో దళిత క్రైస్తవులను బీసీ–సి గా పరిగణిస్తూ అప్పటి ప్రభుత్వ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ ఆర్డర్ పార్లమెంట్ ఆమోదం పొందనందున కేవలం ఆరు నెలలు మాత్రమే అమలులో ఉందన్నారు. ఇన్నాళ్లూ ఏ ఒక్క ప్రభుత్వం కూడా దళిత క్రిస్టియన్లను పట్టించుకోలేదన్నారు. దీంతో వారు ఎన్నో రకాలుగా నష్టపోయారన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చేందుకు వీలుగా అసెంబ్లీ తీర్మానం చేయడం అభినందనీయం అన్నారు. ఈ అంశంపై అనేక మార్లు కోర్టుకు వెళ్లినప్పటికీ ఏ ప్రభుత్వం కూడా తమ గోడు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దళిత క్రైస్తవులందరూ రుణపడి ఉంటామన్నారు. ఈ అంశానికి పార్లమెంట్ ఆమోదం తెలిపి తమను బీసీ–సి లో కలపేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కృపా నియోజకవర్గ అధ్యక్షుడు ఎంబీ అష్కానాజ్, సంఘం నాయకుడు ముప్పిడి బుజ్జిబాబు, అధ్యక్షుడు ఏకే ప్రసాద్‌బాబు, కార్యదర్శి పి.రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. సంఘం ఉపాధ్యక్షులు జి.శామ్యూల్ రాజు, వి.పద్మ, కోశాధికారి నల్లి జాన్‌బాబు, పీఆర్‌వో కె.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులంతా రుణపడి ఉంటారు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షణీయమని ఏపీ బిషప్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి కె.జోసెఫ్ అన్నారు. కొవ్వూరులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమస్య వల్ల అనేక మంది నిరుపేద దళితులు ఎన్నో ఉపాధి, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ తీర్మానం చేయడం చరిత్రాత్మక ఘట్టం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి క్రైస్తవులంతా రుణపడి ఉంటామన్నారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ వారి గ్రామోత్సవం



పుంతలో ముసలమ్మను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చాగల్లు: ఊనగట్లలో కొలువైన పుంతలో ముసలమ్మ అనే కనక మహాలక్ష్మి అమ్మవారి ఉగాది ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈనెల 28న అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వీరవల్లి సత్యనారాయణ, కంకటాల శ్రీనివాస్, బొరుసు శ్రీనివాస్, సాధనాల శ్రీనివాస్, చిక్కం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ ఇస్తున్నా నిర్మాణాలు చేపట్టరేమి?

పెరవలి: లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను వేగంగా చేపట్టేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో రమేష్ సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పిట్టల వేమవరం గ్రామంలోని గృహ లబ్ధిదారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేదలకు సొంతిళ్లు సమకూర్చాలనే ఉద్దేశంతో స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి, ఇసుక, ఐరన్, సిమెంటు, గుమ్మాలు, కిటికీలు వంటి సామగ్రిని ఉచితంగా ఇస్తున్నా నిర్మాణాలు పూర్తికాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ పరిధిలోని లబ్ధిదారులతో వెంటనే గృహాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని వలంటీర్లను ఆయన ఆదేశించారు. పిట్టల వేమవరానికి 58 గృహాలు మంజూరవగా 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన 23 గృహాలు నిర్మాణాలు చేపట్టవలసి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మండా హైమావతి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్ అందిస్తోందన్నారు. నిర్మాణ దశల ఆధారంగా ఎప్పటికపుడు బిల్లులను కూడా చెల్లిస్తోందన్నారు. కాబట్టి లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు.


మరియ తల్లి సన్నిధిలో దివ్య బలిపూజ



నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో దివ్యబలిపూజ సమర్పిస్తున్న పీఠాధిపతులు

దేవరపల్లి: గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో జరుగుతున్న మరియ తల్లి పండగలో భాగంగా శనివారం రాత్రి హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి పూల అంతోని కార్డినల్, ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. ఏలూరు పీఠాధిపతిగా పదేళ్లు పూర్తి చేసుకున్న జయరావు పొలిమెరను నిర్మలగిరి పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సాయంత్రం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకూ పుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. సమిష్టి దివ్యబలిపూజలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఎస్.జాన్‌పీటర్, పలువురు గురువులు, పాదర్లు, భక్తులు, మేత్రాలు పాల్గొన్నారు.

రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ నిరసన



వేళ్లచింతలగూడెంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గోపాలపురం: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై జరిగిన కుట్రను నిరసిస్తూ శనివారం మండలంలోని వేళ్లచింతలగూడెంలోని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్‌రావు నివాసం వద్ద ఆ పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపాయి. పీసీసీ వర్కింగ్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు నమోదు చేసి, కోర్టు ద్వారా జైలు శిక్ష వేయించి, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ వారీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పద్మశ్రీ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రలో మరో గాడ్సేలా మిగిలిపోతారన్నారు. రాహుల్ గాంధీ జరిపిన భారత్ జోడో యాత్ర చూసి నరేంద్ర మోదీ భయపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జేష్ట సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మార్టిన్ లూథర్, కో –ఆర్డినేటర్ ముళ్ల మాధవ్, అరిగెల అరుణకుమారి, జిల్లా ఎస్సీ సెల్ నేత పిట్టా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

కొవ్వూరు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్ష పూరిత చర్యలు మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్ డిమాండ్ చేశారు. రాహుల్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరుపై మండలంలోని కాపవరంలో కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఎంపీగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం సమజసం కాదన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాకే పుల్లారావు, చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి జనకోట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.